రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీలతో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు హాజరయ్యారు. టీయూలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై చర్చించారు. -డిచ్‌పల్లి, నవంబర్ 2

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

సారంగాపూర్, నవంబర్ 2 : ఖమ్మం, హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల అండర్-17, అండర్-19 జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు పీడీ రంగు కృష్ణంరాజు తెలిపారు. సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం రాష్ట్ర బాలికల జట్టు ఎంపిక కోసం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.లలిత, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి, పీడీలు శ్రీధర్, నాగరాజు, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గోపాల్, గంగాధర్, జావిద్ పాల్గొన్నారు.

ఇందల్వాయి, డిచ్‌పల్లి నుంచి..

ఇందల్వాయి/ డిచ్‌పల్లి/ సిరికొండ, నవంబర్ 2 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 కబడ్డీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు బానోత్ విష్ణు, బానోత్ సురేశ్ ఎంపికైనట్లు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ క్రీడా పోటీలు ఈనెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన రాంచరణ్, సౌమ్య ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 హాకీ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సీతయ్య తెలిపారు. ఈనెల 5, 6, 7వ తేదీల్లో సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో రాంచరణ్ ప్రాతినిధ్యం వహిస్తాడని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అండర్-17 బాలబాలికల (ఎస్‌జీఎఫ్) లో ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి పల్లి విద్యార్థి శ్రీధన్ ఎంపికైనట్లు పీడీ సాయి రాధా శనివారం తెలిపారు. ఈనెల 5,6, 7 తేదీల్లో సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో శ్రీధన్ పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో తూంపల్లి క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ నగేశ్ తెలిపారు. ఈ పోటీలు ఈనెల 5, 6, 7వ తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన ఐదుగురు విద్యార్థులు వర్షిత్, షేక్ ఆర్బజ్, శివకాంత్, సిద్ధు, భానుప్రకాశ్‌ను ఎంఈవో రాములు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

సిరికొండ/పొతంగల్, నవంబర్ 2 : సిరికొండ మండలంలోని కొండాపూర్ పాఠశాలలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను స్థానిక హెచ్ఎం లాల్‌సింగ్ శనివారం ప్రారంభించారు. ఏఎంసీ డైరెక్టర్ సంపత్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్, యూత్ అధ్యక్షుడు జీవన్, మాజీ ఎంపీటీసీ చందర్, లక్ష్మణ్, మహేందర్, జగన్, సంతోష్, రాంసింగ్, బుచ్చన్న పాల్గొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు గంధపు రాజు, బజరంగ్ దత్తు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఎస్ఆర్, కేబీఆర్ వాలీబాల్ టోర్నీని మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. మొదటి బహుమతి 11,111 రూ. రెండో బహుమతిగా రూ.5,555 ప్రకటించారు. ఆదివారం విజేతలకు బహుమతులను అందజేయనున్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- ఇందల్వాయి, ఎల్లారెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఇందల్వాయిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇందల్వాయి, నవంబర్ 2 : వానకాలానికి సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపల్లిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకవచ్చిన రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా ? అని ఆరా తీశారు. ధాన్యం విక్రయించిన రైతులకు త్వరితగతిన బిల్లుల చెల్లింపుల కోసం ట్యాబ్‌లో వెంటనే వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి గందరగోళం, పొరపాట్లకు తావు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లుంటే సరి చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. అన్ని కేంద్రాలకు సరిపడా గన్నీ బ్యాగులను సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, విండో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం రమేశ్, డీసీవో శ్రీనివాస్ ఉన్నారు.

ఏకకాలంలో సర్వే, డేటా ఎంట్రీ చేపట్టాలి

రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

కంఠేశ్వర్, నవంబర్ 2 : నిర్ణీత కాల వ్యవధిలోగా ఇండ్ల జాబితా రూపకల్పన ప్రక్రియను పూర్తి చేసి ఎన్యుమరేషన్ బ్లాక్‌లను పక్కాగా గుర్తించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. ఈ నెల 6 నుంచి చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వే ఏర్పాట్లపై కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సర్వే కోసం పూర్తిస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేలో భాగస్వాములు చేయాలని ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై కీలక సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా ఎన్యుమరేటర్లు పక్కాగా సర్వే నిర్వహిస్తూ ఆయా కుటుంబాలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్‌మహతో, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కొనుగోలు కేంద్రం సందర్శన:** డిచ్‌పల్లి, నవంబర్ 2 : మండలంలోని ధర్మారం(బీ)లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మానిటరింగ్ అధికారి సత్యనారాయణరావు మయూరీ శనివారం సందర్శించారు. త్వరగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సీఈవో నారాయణరెడ్డి, విండో చైర్మన్ రామకృష్ణ, రైతులు చాకటి మురళి, జావిద్, ప్రశాంత్ తదితరులున్నారు.
- **ధర్మారం పాఠశాలను సందర్శించిన డీఈవో:** డిచ్‌పలి, నవంబర్ 2 : మండలంలోని ధర్మారం జడ్పీహెచ్ఎస్‌ను డీఈవో ఎన్.వీ.దుర్గాప్రసాద్ శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరుతోపాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలించారు. పదో తరగతి ప్రత్యేక తరగతులకు సంబంధించిన టైంటేబుల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. డీఈవో వెంట హెచ్ఎంలు సూర్యకుమారి, సంధ్యానాయక్, టీచర్లు ఉన్నారు.
- **టీచర్‌పై చర్యలు తీసుకోవాలి:** ఖలీల్‌వాడి, నవంబర్ 2: మాక్లూర్ కేజీబీవీలో ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన టీచర్ గౌతమిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగజ్యోతికి శనివారం వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ నాయకులు రమేశ్, సతీశ్, సాయి ఉన్నారు.
- **గుండారం విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి :** సారంగాపూర్, నవంబర్ 2 : మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె. గంగాలక్ష్మికి పెందోట సాహిత్య పీఠం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవిత రచన పోటీల్లో ప్రోత్సాహక బహుమతి లభించినట్లు హెచ్ఎం అమర్‌నాథ్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గంగాలక్ష్మిని అభినందించారు. ఈ నెలాఖరులో సిద్దిపేటలో జరిగే కార్యక్రమంలో గంగాలక్ష్మికి బహుమతిని నిర్వాహకులు అందజేయనున్నారు.
- **చిన్నారులకు టీకాలు:** రుద్రూర్, నవంబర్ 2 : మండలంలోని బొప్పాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బరువులు చూశారు. వైద్యులు చూపిన ప్రకారం చిన్నారులకు ఎప్పటికప్పుడు టీకాలు వేయిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నీతిక, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త శ్రీలేఖ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ తదితరులు ఉన్నారు.
- **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత:** చందూర్, నవంబర్ 2: మండల కేంద్రానికి చెందిన వాహెద్ బీకి సీఎంఆర్ఎఫ్ కింద రూ.42,800 మంజూరుకాగా.. ఇందుకు సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, గ్రామ పెద్దలతో కలిసి శనివారం అందజేశారు.
- **క్రీడా దుస్తుల పంపిణీ:** ధర్పల్లి, నవంబర్ 2 : మండలంలోని దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహకారంతో శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఉల్లాస్ ట్రస్ట్ తరపున దుబ్బాక, సల్లగరిగె, మైలారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున చెక్కులను సంస్థ ప్రతినిధి ఎం.అశ్విన్ మండల విద్యాధికారి రమేశ్ చేతుల మీదుగా అందజేశారు.
- **కాశీకి మంచాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వైకుంఠరథం:** ఖలీల్‌వాడి, నవంబర్ 2 : జిల్లా కేంద్రంలోని మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మంచాల జ్ఞానేందర్‌గుప్తా వైకుంఠ రథాన్ని 'కాశీ'కి ఉచితంగా అందజేశారు. ఈ మేరకు రథాన్ని శనివారం ఆయన ప్రారంభించారు.
- **ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం:** కోటగిరి(పోతంగల్), నవంబర్ 2 : మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘ కార్యదర్శి కమలేశ్ శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాలుకు ఏ-గ్రేడ్ రకం 2,320, బి-గ్రేడ్ రకం రూ.2300 మద్దతు ధర అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ యూనివర్సిటీ ఎంబీఏ నోటిఫికేషన్ విడుదల

ఖలీల్‌వాడి, నవంబర్ 2 : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ కె.రంజిత తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు ద్వితీయ, తృతీయ సంవత్సర రెన్యువల్ గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు 7382929612, వెబ్‌సైట్ www.braouonline.in ను సంప్రదించాలని కోరారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కోటగిరి(పోతంగల్), నవంబర్ 2: గ్రామ పంచాయతీ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని కోరారు. కోటగిరిలో శనివారం పంచాయతీ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. ఈ నెల 6న జిల్లా కేంద్రంలో ఒక రోజు చేపట్టనున్న నిరాహార దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

విగ్రహాల ప్రతిష్ఠకు ముందస్తు అనుమతి తప్పని సరి: ఇన్‌చార్జి సీపీ

వినాయక్‌నగర్, నవంబర్ 2: జిల్లాలో విగ్రహాల ప్రతిష్ఠాపన, డీజే ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ సూచించారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రద్దీ ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు ఉన్న చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదని వెల్లడించారు. ఊరేగింపులు,బహిరంగ సభల్లో పరిమితులకు మించి ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డీజే సౌండ్ సిస్టంలను నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు, జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాల్సి వస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. 500 మందితో సమావేశాలు,సభలు నిర్వహించాల్సి ఉంటే సంబంధిత ఏసీపీ, ఐదు వందల మంది కన్నా ఎక్కువగా ఉంటే మూడు రోజుల ముందు సీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

వినాయక్‌నగర్, నవంబర్ 2: నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడు మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన రాజయ్య(42)గా గుర్తించి, మృతదేహాన్ని జిల్లా దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లా దవాఖానలో శుక్రవారం అనారోగ్యం కారణంగా అవుట్ పేషెంట్‌గా చూపించుకున్నట్లు మృతదేహం వద్ద ఓపీ చీటి లభించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఎస్సై వెల్లడించారు.

ఇటీవల వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా గడుగు గంగాధర్ నియామకమైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

-కంఠేశ్వర్, నవంబర్ 2

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఖలీల్‌వాడి, నవంబర్ 2: మోపాల్ మండలం బోర్గాం(పి) పాఠశాలలో విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. కెనరా బ్యాంకు పాంగ్రా మేనేజర్ శివప్రసాద్, మధుకుమార్, హెచ్ఎం శంకర్, శ్రీకాంత్, అరుణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

జక్రాన్‌పల్లి, నవంబర్ 2 : మండలంలోని చింతలూర్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు చిన్ని కృష్ణుడు (నాగుల చిన్నగంగారాం) వ్యవసాయ క్షేత్రాన్ని ఆత్మ పథక సంచాలకుడు జి.కెన్నత్ ప్రవీణ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న డీలర్లు శనివారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వరి రకాలను పరిశీలించారు.

అన్ని వర్గాల మంచి కోసమే కుల గణన

కంఠేశ్వర్, నవంబర్ 2: సమగ్ర కులగణన అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగడానికేనని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యలను పరిష్కరించడానికే సీఎం బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. బీజేపీ నాయకులు చెప్పిన పసుపు బోర్డు, స్మార్ట్ సిటీ ఎక్కడ ఉందని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

రాజకీయ కక్షతోనే ఆరోపణలు

డిచ్‌పల్లి, నవంబర్ 2: మండలంలోని మిట్టాపల్లి గ్రామంలో తాను ఎలాంటి ప్రభుత్వ భూములను ఆక్రమించలేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒడ్డెం నర్సయ్య స్పష్టం చేశారు. శనివారం ఆయన డిచ్‌పల్లిలోవిలేకరులతో మాట్లాడుతూ మిట్టాపల్లికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు తనపై అసత్య ప్రచారం చేస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని పత్రికల్లో పేర్కొనడం బాధాకరమన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

శిక్షణకు ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 2: ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారుల ఎంపికలను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ తెలిపారు. బాలికలకు మోర్తాడ్ గర్ల్స్ హైస్కూల్‌లో, బాలురకు రెంజల్ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన వారు ఈనెల 8నుంచి 11వ తేదీ వరకు హనుమకొండలో నిర్వహించనున్న70వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త న్యాయ చట్టాలపై అవగాహన అవసరం

నూతన న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్యామ్‌రావు, సమ్మయ్య

బోధన్, నవంబర్ 2: కొత్త న్యాయ చట్టాలపై బోధన్ డివిజన్‌లోని పోలీస్, అటవీ, ఎక్సైజ్ శాఖల అధికారులకు బోధన్ న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం శిక్షణ తరగతులను నిర్వహించారు. బోధన్‌లోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యామ్‌రావు, బోధన్ సబ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య జూలై నుంచి అమల్లోకి వచ్చిన నూతన న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మారిన న్యాయ చట్టాల్లోని వివిధ అంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు మాట్లాడుతూ.. గతంలో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత - 1923, గతంలో ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఆఫ్ ఇండియా స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత చట్టం - 1923 అమల్లోకి వచ్చాయన్నారు. సబ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య మాట్లాడుతూ.. గతంలో ఉన్న ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అదినియం - 2023ను అవగాహన చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో బోధన్ సీఐ వెంకట నారాయణతోపాటు ఫారెస్ట్, ఎక్సైజ్ పోలీసులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

హన్మాండ్లు(ఫైల్)

మోర్తాడ్, అక్టోబర్ 2: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు(65) రెండురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాండ్లు మతిస్థిమితం బాగా లేదు. భార్య చనిపోవడంతో ఒంటరి అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గ్రామశివారులోని పెద్దమ్మగుడి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువులకు టీకాలు

మాక్లూర్, నవంబర్ 2: మాందాపూర్ గ్రామంలో పశువులకు వైద్యులు కిరణ్‌దేశ్ పాండే, ఉమామసాహేర్ శనివారం వ్యాక్సిన్ చేశారు. వినీత, కళ్యాణి, పాషా, శ్యామల, పుష్పా గంగాధర్, మహేశ్వరి, సుధీర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు 'గీత' పోటీలు

రెంజల్, నవంబర్ 2: మండలంలోని కందకుర్తి కేశవ శిశు విద్యామందిర్ పాఠశాల విద్యార్థులకు భగవద్గీతలోని 17వ అధ్యాయంపై పోటీలను శనివారం నిర్వహించినట్లు ప్రధానచార్యుడు సతీశ్ తెలిపారు. బాలాజీ సత్సంగ్ -వెల్మల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. బాలాజీ సత్సంగ్ వ్యవస్థాపకుడు కృష్ణమోహన్, చరిత్ర కారుడు కందకుర్తి యాదవ్‌రావు, ఆచార్యులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

రెంజల్, నవంబర్ 2: మండలంలోని కందకుర్తి గోదావరినదిలో పుష్కరఘాట్ల వద్ద భక్తులకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గోదావరి మహా హారతి జిల్లా అధ్యక్షుడు రచ్చ తిరుపతి మండిపడ్డారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే గోదావరి మహాహారతికి తరలివచ్చే భక్తులకు పుష్కర ఘాట్‌లపై చేరిన మట్టితో ప్రమాదాలు పొంచి ఉన్నాయన్నారు. అధికారులు, ఘాట్ నిర్వహణ కమిటీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సౌకర్యాల కల్పనకు స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

బోధన్ రూరల్, నవంబర్ 2: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సంగం గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పని కోసం పాత వర్నికి చెందిన పలువురు ట్రాక్టర్‌పై భవానీపేట్‌కు వస్తున్నారు. సంగం గ్రామం వద్ద పాత వర్నికి చెందిన కాశీరాం(45) ప్రమాదవశాత్తు జారీ పడ్డాడు. ట్రాలీ టైర్లు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

అమరవీరులకు నివాళి

భీమ్‌గల్, నవంబర్ 2: భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం సాగిన పోరాటంలో అమరులైన వారికి సీపీఎం న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అణిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అల్తాఫ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

The Nizamabad District Co-Operative Central Bank Ltd, NIZAMABAD

ప్రకటన Date: 01/11/2024

శ్రీ ఆర్మూర్ గంగారెడ్డి తండ్రి ఆర్మూర్ రాజన్న, వయస్సు: 49, వృత్తి: వ్యవసాయం, ని: ఇ.నెం. 1-59/A, జక్రాన్ పల్లి గ్రామము, మం: జక్రాన్ పల్లి, జి: నిజామాబాద్. జక్రాన్ పల్లి గ్రామము లోని ఇల్లు నెం: 1-59/A, GP No: 1-59, విస్తీర్ణము 1591 చదరపు గజములు సరియగు 176.77 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలము లో ఇంటి నిర్మాణము కొరకు ఇంటి ప్లాను జతపరచిన ప్రకారం హద్దులు తూర్పు: జైడి నర్సయ్య గారి ఇల్లు, పడమర: నోముల సాయి రెడ్డి గారి ఇల్లు, ఉత్తరం: ద్యావర శెట్టి సదానందం గారి ఇల్లు, దక్షిణం: జైడి మహిపాల్ గారి ఇల్లు, ఇట్టి యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనము లో ఉండి ఇంటి నిర్మాణ లోను కొరకు NDCCB బ్యాంకు, బ్రాంచ్: జక్రాన్ పల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నాను. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కాని ఆక్షేపణలు కాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ చేయగలరు.

సం/- NDCCB బ్యాంకు, మేనేజర్: A.శ్యాం,
బ్రాంచ్ : జక్రాన్ పల్లి, Cell: 9912085802.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ) | ఆర్యానగర్ శాఖ (17931) డోర్ నెం.1-13-405/సి, రుక్మిణి హౌస్, వినాయక్‌నగర్, ఆర్యానగర్ బ్రాంచ్, నిజామాబాద్-503001

స్వాధీనతా ప్రకటన {రూల్-8(1)} (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్యానగర్ శాఖ** (17931) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం HLPGN అకౌంట్‌లో తెలిపిన వడ్డీ మరియు నెలవారి వాయిదాలతో కలిపి 15-07-2024 నాటికి **రూ. 30,04,304.71 (ముప్పై లక్షల నాలుగు వేల మూడు వందల నాలుగు రూపాయల డెబ్బై ఒక్క పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత/ హామీదారులు/ తనఖాదారులు: 1. శ్రీ గడ్డం సురేందర్ రెడ్డి తండ్రి గడ్డం గంగారెడ్డి,** ఫ్లాట్ నెం.401, ఇం.నెం.11-1-279/4/40, పృథ్వి వసంత్ ప్రెస్టేజ్ పార్క్, వార్డ్ నెం.11, బ్లాక్ నెం.1, కంఠేశ్వర్, నిజామాబాద్-503003, **2. శ్రీ మామిడి ప్రవీణ్ రెడ్డి, తండ్రి ఎమ్.లింబారెడ్డి,** ఫ్లాట్ నెం.208, మొదటి అంతస్తు, అలేఖ్య అవెన్యూ, గంగాస్థాన్ ఫేజ్ II, గోపన్‌పల్లి గ్రామం, నిజామాబాద్ మండలం మరియు జిల్లా-503003 వారిని కోరుతూ 15.07.2024 తేదీగల డిమాండ్ నోటీసు (పత్రికా ప్రచురణ తేది: 29.08.2024) జారీచేశారు.

రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సదరు రూల్స్‌లోని రూల్ 9తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **30-10-2024న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు 15.07.2024 నాటికి **రూ. 30,04,304.71 (ముప్పై లక్షల నాలుగు వేల మూడు వందల నాలుగు రూపాయల డెబ్బై ఒక్క పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు నెలవారి వాయిదాలు కలిపి సదరు మొత్తం కొరకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్యానగర్ శాఖ** (17931) యొక్క చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారును మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తుల వివరణ

56.00 చ.గజాలు భూమి అవిభాజ్య వాటాతో సహా, కార్ పార్కింగ్ మరియు కామన్ ఏరియాలు కలిపి, 1145.00 చ.అ. (ప్లింత్ ఏరియా) విస్తీర్ణం, నిజామాబాద్, కంఠేశ్వర్, సర్వే నెం.302/పి1, బ్లాక్ నెం.1, వార్డ్ నెం.11లో గల, మున్సిపల్ నెం.11-1-279/4/40 కలిగిన, పృథ్వి వసంత్ ప్రెస్టేజ్ పార్క్‌లో 4వ అంతస్తులో గల ఫ్లాట్ నెం.401 కలిగిన ఆస్తి యావత్తు, **సరిహద్దులు:** ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: కారిడార్ తరువాత ఫ్లాట్ నెం.402, పడమర: ఖాళీ, ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ తరువాత ఫ్లాట్ నెం.403. అపార్ట్‌మెంట్ సరిహద్దులు: తూర్పు: పొరుగువారి భూమి, పడమర: రోడ్, ఉత్తరం: పొరుగువారి భూమి, దక్షిణం: రోడ్. పై ఆస్తి **శ్రీ గడ్డం సురేందర్ రెడ్డి తండ్రి గడ్డం గంగారెడ్డి** కి చెందినది. ఇది ఫ్రీహోల్డ్ ప్రాపర్టీ.

ప్రచురణ తేది: 03-11-2024 | **సం/- అధీకృత అధికారి,**
ప్రదేశం: నిజామాబాద్ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

బోధన్, నవంబర్ 2: మహారాష్ట్ర బీడ్ జిల్లా కపిల్‌ధార్‌లోని ప్రముఖ శైవక్షేత్రం మన్మథస్వామి ఆలయానికి బోధన్ నుంచి భక్తుల మహా పాదయాత్ర శనివారం ప్రారంభమైంది. 360 కిలోమీటర్ల మేర పదమూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పాదయాత్రను పట్టణంలోని జంగంగల్లీలోని పురాణే మఠంలో సుంకినికి చెందిన శైవగురువు సిద్దేశ్వర స్వామి ప్రారంభించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

రికార్డులను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీపీవో

నవీపేట, నవంబర్ 2: గ్రామ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని యంచ గ్రామ పంచాయతీని ఆయన శనివారం తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుధారాణికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్ రూరల్, నవంబర్ 2: మండలంలోని మంజీరానది పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రెవెన్యూ, పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకున్నారు.

ఆర్మూర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 2: ఆర్మూర్ కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సును నిర్వహించినట్లు సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు న్యాయ విజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్న స్వామిజీ

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 2:ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో ఉన్న ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమంలో మంగళగిరి నరసింహ మూర్తి స్వామిజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ధ్యానం విశిష్టతను ఆయన వివరించారని పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోధన్ రూరల్, నవంబర్ 2: మండలంలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి గ్రామాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు శనివారం పంపిణీ చేశారు. మొత్తం నలుగురికి ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రమావత్ రవిదాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలు షురూ

మాక్లూర్, నవంబర్ 2: ఎట్టకేలకు మండలంలో వడ్ల కాంటా షురువైంది. 15 రోజులుగా వానకు తడిసి, ఎండకు ఎండిన వడ్లను చూసి ఆవేదన చెందిన రైతులు కాంటా ప్రారంభం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. మాక్లూర్ పీఏసీఎస్ పరిధిలోని పలు గ్రామాల్లో తూకం వేస్తున్న తీరును చైర్మన్ బూరోళ్ల అశోక్ పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్, డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోధన్ రూరల్, నవంబర్ 2: సాలూరా మండలంలోని హున్సా గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బుచ్చల వార్ రవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ మండల వ్యవసాయ అధికారి సంతోష్‌నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ కులకర్ణి వినోద్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మాక్లూర్, నవంబర్ 2: అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి చిన్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం వినతి పత్రం అందజేశారు. డెస్క్ బెంచీలను ఇప్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి రామకృష్ణారెడ్డి, హెచ్ఎం రాజేందర్, ఉపాధ్యాయులు రమణాచారి, వనిత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఏసీపీకి మొర

నవీపేట, నవంబర్ 2: తన భార్య మృతికి కారణమైన వాహన డ్రైవర్‌ను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన మ్యాతరి అబ్బయ్య కోరుతున్నాడు. ఈ మేరకు ఏసీపీ రాజావెంకటరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశాడు. సెప్టెంబర్ 14న బైక్‌పై వెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో తన భార్య సంగీత మృతిచెందిందని తెలిపాడు. ఆరో టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు వాహన డ్రైవర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపాడు. తగిన న్యాయం చేయాలని ఏసీపీని కోరాడు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.